# దాత

చీమలు దూరని చిట్టడవి.

కాకులు దూరని కారడవి.

హెడ్డు వెంకటస్వామి మాత్రం ఆ అడవిలో దూరేశాడు.

అతను ఫారెస్టు డిపార్టుమెంటు కాదు.

యాంటీ నక్సలైట్ స్క్వాడ్‌తో వచ్చేడు.

అయితే ప్రస్తుతం అతను ఆ అడవిలో తిరుగుతున్నది నక్సలైట్లకోసం కాదు.

చింతపంట కోసం.

ఆ అడవుల్లో చింతపంట, కుంకుడుకాయలు అతి చవగ్గా దొరుకుతాయి. కొండవాళ్లకి ధరలు తెలీవు. తూకాలు తెలీవు.

ఎంతో కొంతకి ఇచ్చేసి పోతారు. వాళ్లదగ్గర రూపాయికి కొని పదిరూపాయలకమ్ముకుంటారు షావుకార్లు.

అంచేత చింతపండు కొనడంకూడా తన డ్యూటీలో కలుపుతున్నాడు వెంకటస్వామి.

ఆవేళ అడవంతా తిరగ్గా, తిరగ్గా కాళ్లు లాగేస్తున్నాయి.

అలా ఒక చెట్టు కింద చేరబడి కూర్చున్నాడు.

చిన్న మాగన్ను పట్టింది. పక్కన ఎండుటాకుల గలగల.

కళ్లు విప్పేడు.

ఎదురుగా ఉన్నది చింతపండు అమ్మే కొండపిల్లకాదు.

మంచి వయసులో ఉన్న చిరుతపులి.

హెడ్డు పరిగెత్తేడు.

ఎలా?

రమారమీ పెద్దపులి స్పీడులో.

పులి అతన్ని వెంబడించింది.

ఎలా? చిరుతపులి స్పీడులో.

మరో మూడు సెకండ్లు.

వెంకటస్వామి మిగలడు.

రెండు సెకండ్లు అయ్యేయి.

'ఢాం' అంది తుపాకీ.

గాండ్రించింది పులి.

అదే దాని ఆఖరి గర్జన. హెడ్డు చేతులు చూసుకున్నాడు. తుపాకీ లేదు.

ఎదురుగా నిల్చున్నాడు కొండంత కొండవాడు.

చేతిలో తుపాకీ.

అతన్ని కౌగలించుకుని భోరుమన్నాడు వెంకటస్వామి.

కృతజ్ఞతలు గుప్పించేడు.

అతని రుణం జన్మజన్మలకీ తీర్చుకోలేనన్నాడు.

కొండవాడు నవ్వుకుంటూ వెళ్లిపోయేడు.

* * *

కొన్ని నెలలు గడిచేయి.

నక్సలైట్ నాయకుడు మల్లుదొరని సజీవంగాగాని, నిర్జీవంగాగాని పట్టుకున్నవారికి లక్షరూపాయలు బహుమానం ప్రకటించింది ప్రభుత్వం.

వెంకటస్వామి, అతని అనుచరులు అడవులంట తిరుగుతూనే ఉన్నారు.

"ఈ మల్లుదొరెవడ్రా బాబూ మనపీకలమీదికి? ముల్లులా గుచ్చుకుంటున్నాడు. అయినా ఆడు కనిపిస్తే మాత్తరం ఎలా పోల్చుకుంటాం? మెళ్లో బోర్డుగట్టుకు తిరుగుతాడా? లేకపోతే కొమ్ములుంటాయా? ఎలాగరా బాబూ. ఆళ్లకేం? అయిదరాబాదులో కూకుని ఆర్డర్లేసేస్తారు, అడ్ని పట్టుకోండి. ఈడ్ని కాలిసేయండి అని. ఈ అడవులంట తిరగలేక ఛస్తున్నా, మనం ఎప్పుడ్ని పట్టుకున్నా, మానినా మనల్నిమాత్రం ఏ పెద్దపులో, ఎలుగొడ్డో సంపిందంటే అవమానం. మరంచేత ఫలానా అడవిలో పోలీసులకీ నక్సలైట్లకీ జరిగిన ఎన్‌కౌంటర్లో ఇద్దరు పోలీసుల

దుర్మరణం. అని మనోళ్లే పేపర్లో వేయించేస్తారు. తరువాత మన పెళ్లాలకి పాతికో, పరకో పారేస్తారు. అదిరాబాబూ మన బతుకు" విసుక్కున్నాడు, వెంకటస్వామి. "ఆడ్నినేను పోల్చుకోగల్ను' అన్నాడో కుర్రకానిస్టేబిలు.

'బయల్దేరేడండి పోటుగాడు' నవ్వేరు మిగతావాళ్లు.

ఆ రాత్రి వాళ్లంతా గస్తీ తిరుగుతున్నారు.

చిమ్మచీకటి. చెట్లమధ్య తిరుగుతున్న మిణుగురు పురుగులు చెట్లకి పూసిన వెండి పువ్వుల్లా మెరుస్తున్నాయి. గెద్ద కలలో కొచ్చిన పక్షిపిల్లలు తల్లి రెక్కలకింద కువకువలాడుతున్నాయి. వెంకటస్వామి బృందానికి వాళ్ల గుండె చప్పుళ్లు యముడి మహిషపు లోహపుగంటల్లా వినిపిస్తున్నాయి. వాళ్ల గుండెలు వాళ్ల పిడికిళ్లలోనే ఉన్నాయి.

పిడికెడంత గుండె అని అందుకే అంటారు.

అనుకున్నారు వాళ్లు.

ఎవ్వరూ మాట్లాడలేదు.

వెంకటస్వామి చేతిలో చేతికర్రంత టార్చిలైటుంది.

కాని బేటరీల్లేవు. వెయ్యడం మర్చిపోయినందుకు తనని తను శపించుకున్నాడు. దూరంగా చిన్న వెలుగు, అందరి గుండెల్లోను చిన్న ఆశ. మిణుగురు పురుగేమో అన్న సందేహం. పురుగైతే కదలకుండా ఉంటుందా?

ఉండదు.

అందరి గుండెల్లోనూ చిరు సంతోషం.

"అదేదో గుడిసెలాగుంది, కాసేపు అక్కడ కూకుందాం" అన్నాడు వెంకటస్వామి.

తడవుకుంటూ వెళ్లేరు.

అది గుడిసే.

అందులో మినుకుమినుకుమంటున్న లాంతరు.

గుడిసె బయట నులకమంచం.

మంచంమీద మాంఛి నిద్రలో ఉన్నాడు కొండవాడు.

"వీడే మల్లుదొర" అన్నాడు కుర్ర కానిస్టేబిలు.
తుపాకీలు ఎక్కుపెట్టేరు.
"వీడే నన్ను పులినుండి కాపాడేడు" అన్నాడు వెంకటస్వామి.
తుపాకీలు దించేశారు.
క్షణంలో సగం....
జబ్బుతో మందుల్లేక లేవలేని తల్లి,
ఉద్యోగంలేని తమ్ముడు,
ఎదుగుతున్న పిల్లలు.
చాలని జీతం.
కళ్లలో మెదిలేయి వెంకటస్వామికి.

* * *

మల్లుదొరని పట్టి యిచ్చినందుకు వెంకటస్వామికి ప్రభుత్వం లక్ష రూపాయలు ఇచ్చి రుణం తీర్చుకుంది.

*("ఆంధ్రప్రభ" 22-6-1998)*

★ ★ ★